## ఒకటిన ఉమ్మడి జిల్లా సైక్లింగ్ ఎంపిక పోటీలు



కొత్తపల్లి, ఆగస్టు 30 : కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 1న ఉమ్మడి జిల్లా సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చైర్మన్ వీ నరేందర్‌రెడ్డి, అధ్యక్షుడు బుర్ర మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో అండర్-14, 16, 18, 23, 23 సంవత్సరాల పై విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. అందులో ప్రతిభ చాటిన వారిని సెప్టెంబర్ 14,15వ తేదీల్లో నిజామాబాద్‌లో నిర్వహించే ప్రాంతీయస్థాయి ఖేలో ఇండియా, జనగామలో జరగబోయే రాష్ట్ర స్థాయి రోడ్డు సైక్లింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9398230614 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.






# స్పష్టత లేని సర్పంచ్ ఎన్నికలు?

- ఆదేశాలు, హడావుడి తప్ప.. ఆచరణలో అంతా తుస్
- ఇప్పట్లో జరిగేందుకు అవకాశాలు తక్కువ
- నేటికీ ఖరారు కాని రిజర్వేషన్లు
- ఓటర్ జాబితా ఆధారంగా సర్పంచ్ ఎన్నికలు : చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- బీసీ కులగణనకు కట్టుబడి ఉన్నాం : మంత్రి పొన్నం ప్రభాకర్
- సెప్టెంబర్ 6న పంచాయతీల్లో ముసాయిదా జాబితా
- 21న తుది జాబితా ప్రకటన

**పంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో జరుగుతాయా..? దానిపై ప్రభుత్వానికి స్పష్టత ఉన్నదా..? పాత రిజర్వేషన్లు కొనసాగిస్తారా? లేక కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా అమలు చేస్తారా? బీసీ కులగణన తర్వాత నిర్వహిస్తారా..? లేక ఓటర్ల జాబితా ప్రకారం ఎలక్షన్లకు వెళ్తారా..? ఇటువంటి అనేక సందేహాల మధ్య సర్పంచ్ ఎన్నికలు కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు, ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడుతున్న మాటలు.. ఫిబ్రవరి నుంచి మారుతూ వస్తున్న ఆదేశాలను నిశితంగా పరిశీలిస్తే అసలు సర్పంచ్ ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు లేవని స్పష్టమవుతున్నది. అయితే, పల్లెల్లో రాజకీయ వేడిని అలాగే ఉంచడంతోపాటు పార్టీ శ్రేణులు అధికార పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా చూసేందుకు ఈ తరహా ప్రకటనలే అవసరం కాగా, ప్రభుత్వం ఈదిశగా అడుగులు వేస్తున్నదన్న అభిప్రాయాలు సొంత పార్టీ నుంచే వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఇదంతా ఒక ప్రణాళికలో భాగమే అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అయితే, రిజర్వేషన్లకు సంబంధించి ఏ ఒక్క విషయంలోనూ క్లారిటీ ఇవ్వని ప్రభుత్వం, ముసాయిదా జాబితా, తుది జాబితా అంటూ చేస్తున్న హడావుడి మాత్రం అంతా ఇంతా లేదు.**

కరీంనగర్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వార్డులు, గ్రామపంచాయతీల వారీగా రూపొందించిన ఓటర్ ముసాయిదా జాబితాను సెప్టెంబర్ ఆరో తేదీన జీపీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సీ పార్థసారధి ఆదేశించారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటర్ లిస్టు తయారీ, ప్రచురణ పురోగతిపై జిల్లా అధికారులతో మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రూపొందించిన ఓటర్ల లిస్టుల ప్రకారం యథావిధిగా వార్డు, పంచాయతీ వారీగా జాబితాను తయారు చేయాలని సూచించారు. ఆ ముసాయిదా ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో అంటించిన తర్వాత మండల, జిల్లా స్థాయిల్లో వేర్వేరుగా రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేయాలని, వారి నుంచి అభ్యంతరాలు, సూచనలు, సలహాలు తీసుకోవాలని ఆదేశించారు. ముసాయిదా ఓటర్ జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉంటే సెప్టెంబర్ 13వ తేదీ వరకు సంబంధిత మండల పరిషత్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులకు రాతపూర్వకంగా తెలుపాలని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఆ అధికారులు తగిన చర్యలు తీసుకొని సవరించిన తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 21వ తేదీన ప్రచురించాలని సూచించారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో చేర్చుకోవాలన్నా, ఓటర్ల తొలగింపు కోసం ఆక్షేపణలున్నా నిర్దేశించిన ఎన్నికల ఫారంను నింపి సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ ఓటర్ల చేర్పు, తొలగింపు తర్వాతనే గ్రామపంచాయతీ ఓటరు లిస్టును పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఓటర్ లిస్టుల తయారీ తర్వాత వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది వివరాల సేకరణ, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, తదితర అంశాలపై అనుసరించాల్సిన పద్ధతులపై అధికారులకు ఆయన వివరించారు. ఈ మొత్తం ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘం తయారు చేసిన సర్క్యులర్‌ను తూ.చ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఓటర్ లిస్టుల తయారీలో పురోగతి, ఎదురవుతున్న ఇబ్బందులపై కలెక్టర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు.

### డిసెంబర్‌లోనే ఆదేశాలు

పంచాయతీ ఎన్నికలెప్పుడొచ్చినా వాటిని సమర్థవంతంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం డిసెంబర్‌లోనే ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి ఒకటితో జీపీ పాలకవర్గాల గడువు పూర్తయింది. ఈ నేపథ్యంలో సర్పంచ్ ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లు వెంటనే చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (లెటర్ నంబర్ 921/ టీఎస్ఇసీ-పీఆర్/ 2023) అన్ని జిల్లాల కలెక్టర్లను అప్పుడే ఆదేశించింది. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారో.. వారికి తగ్గట్టుగా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమించాలో నిర్దేశించింది. పంచాయతీ ఎన్నికలను ఎన్నికలను 2019 జనవరిలో వివిధ దశల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం 2024 ఫిబ్రవరి ఒకటితో పాలకవర్గాల పదవీకాలం ముగియగా, రాజ్యాంగంలోని 243(3)(ఏ) ఆర్టికల్ ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను ఐదేళ్ల పదవీ కాలం ముగిసేలోపే నిర్వహించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం గత ఉత్తర్వుల్లో పేర్కొన్నది. అంతేకాదు, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 14(2) ప్రకారం పాలకవర్గ పదవీకాలం ముగియడానికి మూడు నెలల్లోపు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందని చెప్పింది. అందుకోసం రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందిని నియమించడంతోపాటు శిక్షణ ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. 200 ఓటర్లు ఉన్న పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఒక ప్రిసైడింగ్ అధికారి ఒక పోలింగ్ అధికారిని నియమించాలని సూచించింది. అలాగే 201 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు.. 401 నుంచి 650 వరకు ఓటర్ల ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించుకోవాలని ఆదేశించింది. ప్రతి వార్డులో ఒక పోలింగ్ బూత్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, 650 దాటితే రెండు పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. సిబ్బందితోపాటు ప్రిసైడింగ్ అధికారులతో జాబితా సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేసింది. నిశితంగా పరిశీలిస్తే.. అప్పటినుంచి ఇప్పటివరకు ఇలా ఆదేశాలు రావడమే తప్ప.. రిజర్వేషన్ల ప్రక్రియ మాత్రం కొలిక్కిరావడం లేదు. అది వస్తే తప్ప వీటి ద్వారా పెద్దగా ప్రయోజనం ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఏదీ రిజర్వేషన్లపై స్పష్టత?

నిజానికి సర్పంచ్ ఎన్నికలు జరగాలంటే ముందుగా రిజర్వేషన్లపై స్పష్టత రావాల్సిన అవసరముందంటున్నారు నిపుణులు. దానికి ముందుగా ప్రభుత్వం ఏ విధానంలో ఎన్నికలకు పోతుందన్న అంశాన్ని విప్పిచెప్పితే తప్ప అడుగు ముందుకు వేయలేమంటున్నారు అధికారులు. ప్రధానంగా బీసీ కుల గణన అయిన తర్వాత ఎన్నికలకు వెళ్తారా..? లేక ప్రస్తుతమున్న ఓటర్ జాబితా ఆధారంగా ఎన్నికలకు వెళ్తరా..? అన్నదానిపై స్పష్టత వస్తే తప్ప ఎలక్షన్లు నిర్వహించడం అసాధ్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని తేల్చిచెప్పకుండా ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడుతున్నది. కులగణనకు కట్టుబడి ఉన్నామని ఇటీవల క్యాబినెట్‌లో తీర్మానం చేసి చెప్పింది. ఈనేపథ్యంలో బీసీ కులగణన తర్వాతే ఎన్నికలు ఉంటాయని అందరూ భావిస్తున్న తరుణంలో రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి మీడియాతో చేసిన చిట్‌చాట్‌లో మరో రకంగా మాట్లాడారు. ఓటర్ జాబితా ఆధారంగా ఎన్నికలకు వెళ్తామన్నారు. ఇదే రోజు మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ కులగణన అధారంగా వెళ్తామని ప్రకటించారు. అంటే.. ఏవిషయంలోనూ ఎవరికీ స్పష్టత లేదని స్పష్టమవుతున్నది. 2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల సమయంలోనూ సుప్రీం కోర్టు పలు ఆదేశాలు ఇచ్చింది. ఏ పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని స్పష్టం చేసింది. ఆ మేరకు 2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లను అప్పటి పంచాయతీ రాజ్ అధికారులు ఖరారు చేశారు. ఆ ప్రకారం చూస్తే బీసీలకు 22.79 శాతం, అలాగే ఎస్సీలకు 20.53 శాతం, ఎస్టీలకు 6.68 శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయించి ఎన్నికలు నిర్వహించారు. అయితే వివిధ రాష్ట్రాల్లో వివిధ పద్ధతుల్లో సర్పంచ్ ఎన్నికలు అప్పట్లో జరిపారు. అంతేకాదు, చాలా రాష్ట్రాల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇచ్చారు. దీనిపై సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. దాని ప్రకారం... బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రతి రాష్ట్రంలోనూ డెడికేటెడ్ కమిషన్ (మన రాష్ట్రంలో బీసీ కమిషన్) నియమించాలని సూచించింది. సదరు కమిషన్ పూర్తి అధ్యయనం చేసి ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు ఇవ్వాలని చెబుతూనే.. ఏ పరిస్థితుల్లోనూ అన్ని కలిపి రిజర్వేషన్లు 50 శాతం మించొద్దని స్పష్టం చేసింది. అంటే సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలంటే.. బీసీ రిజర్వేషన్లు తేల్చాల్సిన అవసరమున్నది. ఇవి తేలాలంటే బీసీ కులగణన అయినా జరగాలి? లేదా ఓటర్ల ప్రాతిపదికన విరాలు సేకరించి రిజర్వేషన్లు కల్పించాలి. అది కూడా 50 శాతం లోపే ఉండాలి.

### ఇరకాటంలో కాంగ్రెస్

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చూస్తే.. ఏ పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం మించొద్దన్నది స్పష్టం. కానీ, కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రస్తుతం సమస్యగా మారుతున్నది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్ల పెంచుతామని కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో స్పష్టమైన హామీ ఇచ్చింది. అక్కడితో ఆగకుండా కొత్త స్థానిక సంస్థల్లో ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని స్పష్టంచేసింది. తద్వారా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కొత్తగా 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పడమే కాకుండా.. బీసీ వర్గాల్లో ఉపకులాల వారీగా వర్గీకరణ చేసి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని తన బీసీ డిక్లరేషన్‌లో స్పష్టం చేసింది. ఒకవైపు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు దాటొద్దు. మరోవైపు బీసీ కులగణన జరగాలి. వీటిపై ప్రభుత్వం ఇప్పటివరకు బీసీ కమిషన్‌కు స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి సంకట స్థితిలో పడింది. బీసీ కులగణన కాకుండా ఎన్నికలు నిర్వహిస్తే ఆ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికే సంఘాలు.. కులగణన చేయాల్సిందేనంటూ పట్టుబడుతున్న విషయం తెలిసిందే. అలాగే ఏ పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సర్దుబాటు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక సవాలే. వీటిని నుంచి తప్పించుకోవడానికే ఎన్నికలు రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నదే తప్ప నిజంగా ప్రభుత్వానికి ఇప్పట్లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలన్న చిత్తుశుద్ధి లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఇప్పట్లో సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు అవకాశాలు తక్కువే అన్నది నిపుణుల మాట!

**గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రిజర్వేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.**

| జిల్లా పేరు | పంచాయతీల సంఖ్య | ఎస్సీ జనరల్ | ఎస్సీ మహిళా | ఎస్టీ జనరల్ మహిళా | ఎస్టీ మహిళా | బీసీ జనరల్ | బీసీ మహిళా | జనరల్ | మహిళా జనరల్ |
|---|---|---|---|---|---|---|---|---|---|
| రాజన్నసిరిసిల్ల | 254 | 25 | 26 | 15 | 16 | 28 | 29 | 57 | 58 |
| జగిత్యాల | 380 | 41 | 41 | 15 | 14 | 45 | 45 | 90 | 89 |
| పెద్దపల్లి | 263 | 27 | 28 | 4 | 4 | 35 | 35 | 65 | 65 |
| కరీంనగర్ | 313 | 40 | 40 | 2 | 2 | 37 | 36 | 78 | 78 |

**ప్రస్తుతం ఉన్న పంచాయతీలు వార్డుల వివరాలు ఇలా ఉన్నాయి.**

| జిల్లా పేరు | పంచాయతీలు | వార్డుల సంఖ్య |
|---|---|---|
| పెద్దపల్లి | 263 | 2,474 |
| జగిత్యాల | 383 | 3,500 |
| కరీంనగర్ | 313 | 2,966 |
| రాజన్నసిరిసిల్ల | 255 | 2,240 |



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

## పంతానికి పోయి రైతులకు అన్యాయం చేయద్దు

- కేసీఆర్‌పై కోపంతో నోట్లో మట్టి కొట్టద్దు
- సర్కారు అనాలోచిత నిర్ణయంతో తీవ్ర నష్టం
- నీరంతా సముద్రం పాలవుతున్నది
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

మానకొండూర్, ఆగస్టు 30 : కాంగ్రెస్ సర్కారు అనాలోచిత నిర్ణయంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మండిపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రైతుల సాగునీటి కష్టాలు తీరిస్తే.. ఆయనపై కోపంతో రేవంత్ సర్కారు రైతుల నోట్లో మట్టికొడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంతానికి పోయి రైతులకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఎల్లంపల్లి ద్వారా నీళ్లు ఎత్తిపోసి వెంటనే మిడ్ మానేరు, ఎల్‌ఎండీ జలాశయాలను నింపాలని సూచించారు. శుక్రవారం మానకొండూర్ మండలకేంద్రంలోని గడిమహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం మోటర్లను ఆన్‌చేసి ఎత్తిపోతలు ప్రారంభిస్తే రైతులు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటారనే అక్కసుతోనే కాంగ్రెస్ సర్కారు కాళేశ్వరం నీటిని సముద్రం పాలు చేస్తున్నారని మండిపడ్డారు. జూలై, ఆగస్టు నెలల్లో రోజుకు 10 లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోయినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం మేడిగడ్డ వద్ద లక్ష 75 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నదని, అయినా సర్కారుకు సోయిలేదన్నారు. మేడిగడ్డ బరాజ్ గేట్లు మూయకున్నా కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీళ్లు ఎత్తిపోయవచ్చని నీటిపారుదలశాఖ అధికారులే చెబుతున్నారని వెల్లడించారు. వర్షాలు లేక పోవడంతో ఎల్‌ఎండీ రిజర్వాయర్ ఇప్పటికీ నిండలేదని, ఎల్లంపల్లి ద్వారా నీటిని ఎత్తిపోసి మిడ్‌మానేరు, ఎల్‌ఎండీ జలాశయాలను నింపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎల్‌ఎండీ రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండితే ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కాకతీయ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేస్తే కుంటలు, చెరువులు నిండి భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. తమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్ట్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు పెడితేనే కాళేశ్వరం ప్రాజెక్ట్ రీ డిజైన్ చేసి మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్లు గుర్తు చేశారు. మేడిగడ్డ వద్ద నిత్యం నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది కాబట్టే ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకే అక్కడ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం రీ డిజైన్‌పై రాద్ధాంతం చేయడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, తెలంగాణ మంత్రులు, ఎంపీలు నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారుల వద్దకు వెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. నవంబర్ నెలలో పంటలకు నీళ్లు ఎక్కువగా అవసరం ఉంటాయని, వెంటనే ఎత్తిపోతలు ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, దేవ సతీశ్‌రెడ్డి, రామంచ గోపాల్‌రెడ్డి, జక్కుల నాగరాజు, అశోక్‌రెడ్డి, వెంకటస్వామి, పిండి సందీప్, ఇస్కుల్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

## భట్టీ.. ఎన్నికల హామీల అమలేది?

- ఐదు నెలలలైనా లాభాల ప్రకటింపేది
- ఆదాయపు పన్ను మినహాయింపేది
- సొంతింటి కల సాకారమేది
- వంద శాతం కారుణ్య నియామకాలేవి
- కొత్త గనులకు అనుమతులేవి
- కార్మికులకు భరోసా ఏది
- డిప్యూటీ సీఎంకు టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రశ్నల వర్షం
- ఖని పర్యటనలో స్పష్టం చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నేత మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని ఆగస్టు 30: ఎన్నికల ముందు సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల అమలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రశ్నించారు. వాటిని అమలు చేస్తామని గోదావరిఖని పర్యటనలో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కొత్త గనులకు అనుమతులు తీసుకువచ్చి కార్మికులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ఆయనదేనని స్పష్టం చేశారు. బొగ్గు గనుల వేలంలో పాల్గొంటారా..? లేదా.. కేంద్రంతో మాట్లాడి సింగరేణి సంస్థకే తెలంగాణలోని బొగ్గు గనులు కేటాయించే విధంగా ఒప్పిస్తారో? శనివారం నాటి పర్యటనలో తేల్చాలన్నారు. గోదావరి ఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గతేడాది సింగరేణి 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించిన నేపథ్యంలో కనీసం 4వేల కోట్ల లాభాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడిచినా సింగరేణి లాభాలను ప్రకటించకపోవడం విడ్డూరమని విమర్శించారు. తక్షణమే లాభాలు ప్రకటించి ప్రతి కార్మికుడికీ 35శాతం వాటా ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు కార్మికులకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. పెర్క్స్‌పై విధించిన ఆదాయ పన్ను తక్షణమే ఇప్పించేలా ఆదేశించాలని డిమాండ్ చేశారు. వంద శాతం కారుణ్య నియామకాలను అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు వందశాతం పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం, ఇల్లు నిర్మించుకోవడానికి ₹20లక్షల వడ్డీలేని రుణం హామీలను అమలు చేస్తారో? లేదో? చెప్పాలన్నారు. గతంలో అనుమతి పొందిన కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు బ్లాకులను ప్రైవేట్ పరం చేస్తారా? కార్మికులకు అప్పగిస్తారో తేల్చిచెప్పాలన్నారు. బొగ్గు గనుల వేలంలో పాల్గొనాలని కొన్ని కార్మిక సంఘాలు కోరడం విడ్డూరమన్నారు. సింగరేణి యాజమాన్యంతో లోపాయికారితనంతోనే ఈ విధంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. యాజమాన్యం అనుకూల సంఘాలతోనే సమావేశాలు నిర్వహించడం అనేక అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడ టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ వైఎస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, నాయకులు చెలుకలపల్లి శ్రీనివాస్, పల్లె సురేందర్, బొగ్గుల సాయి, పులిపాక శంకర్, రొడ్డ సంపత్, గుండు శ్రావణ్, కొమురయ్య ఉన్నారు.

### స్పష్టత ఇవ్వాల్సిందే

ఎన్నికల వేళ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గోదావరిఖని పర్యటనలో స్పష్టం చేయాలని సింగరేణి కార్మిక సంఘాలైన టీబీజీకేఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వేర్వేరుగా విలేకరుల సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బాకీ పడిన ₹29వేల కోట్లను చెల్లించాలన్నారు. కొత్త గనులను ప్రారంభించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, వెంటనే లాభాల వాటాను ప్రకటించాలని కోరారు.

## డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, ఆగస్టు 30: అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖనిలో పర్యటించనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. శుక్రవారం గోదావరిఖనిలోని బీఆర్ఎస్ ఆఫీసులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నా మ్యానిఫెస్టోలోని ఆరు గ్యారెంటీలను ఎందుకు అమలుచేయలేదో చెప్పాలని నిలదీశారు. రైతుభరోసా కోసం రైతులు, పింఛన్ల కోసం వృద్ధులు, ప్రతినెలా రూ. 2500 కోసం మహిళలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ గనికార్మికుల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి వందలకోట్లు వెచ్చించారని పేర్కొన్నారు. తాను పారిశ్రామిక ప్రాంత ప్రగతి కోసం నవ నిర్మాణ సభ ఏర్పాటు చేసి అప్పటి రాష్ట్ర మంత్రి కేటీఆర్ ద్వారా 30 ఐటీ పార్కు అంతర్గాంలో వంద ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్కులకు శంకుస్థాపన చేయించానని గుర్తుచేశారు. కాంగ్రెస్ సర్కారు గతంలో మంజూరైన నిధులతో పనులను పూర్తి చేయాలని కోరారు. రామగుండంలో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు సంతోషకరమని, అయితే జెన్‌కో ద్వారానే నిర్మాణం చేపట్టి స్థానిక యువతకు ఉద్యోగవకాశాలు కల్పించాలన్నారు. తిలక్‌నగర్‌లో నిరుపయోగంగా ఉన్న స్కూల్ భవన్నాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్లు గాధం విజయ, బొడ్డు రవీందర్, పిల్లి రమేశ్, చల్లగురుగుల మొగిళి, నూతి తిరుపతి, తోకల రమేశ్, సట్టు శ్రీనివాస్, గుంపుల లక్ష్మి, యాసర్ల తిమోతి, కోడి రామకృష్ణ, కిరణ్, కనకరాజ్, వెంకటేశ్, రామరాజు, తిరుమల ఉన్నారు.

# ఏదీ సింగరేణి లాభాల లెక్క?

- ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు
- అయినా తేలని వార్షిక పద్దు
- కార్మికుల ఎదురుచూపు
- ఈసారి 35శాతం వాటా చెల్లించాలని డిమాండ్



గోదావరిఖని, ఆగస్టు 30 : ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు కావొస్తున్నా సింగరేణి వార్షిక పద్దు లెక్క తేలడం లేదు. నేటికీ లాభాల వాటాను ప్రకటించలేదు. 2024 జూన్‌లో మరో త్రైమాసిక లెక్కలు ముగిసినా గత ఆర్థిక సంవత్సరం లెక్కలకు సంబంధించి ప్రకటన రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. దేశంలో 85 శాతం బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కోలిండియా సంస్థ, గత ఆర్థిక సంవత్సరంలో ₹1,42,324 కోట్ల వ్యాపారంతో ₹37,369 కోట్ల లాభాలు సాధించినట్టు మే 2న ప్రకటించింది. దీనికి తోడు ఈ ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ₹36,464 కోట్ల వ్యాపారం చేసి ₹10,858 కోట్ల లాభాలు సాధించినట్లు గత నెల 31న వెల్లడించింది. దేశవ్యాప్తంగా విద్యుత్ రంగంలో అగ్రగామిగా ముందుకు సాగుతున్న ఎన్టీపీసీ గత ఆర్థిక సంవత్సరం ₹1,78,501 కోట్ల వ్యాపారంతో ₹21,332 కోట్ల లాభాన్ని సాధించినట్టు మే 24న ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ₹48,521 కోట్ల వ్యాపారంతో ₹5,506 కోట్ల లాభాలు సాధించినట్టు గత నెల 27న వెల్లడించింది. ప్రభుత్వ రంగంలో ఉన్న కోల్ ఇండియా, ఎన్టీపీసీ సంస్థలు ఎంతో పారదర్శకంగా ఎప్పటికప్పుడు తమ వ్యాపార లాభాలను ప్రకటిస్తుంటే.. సింగరేణి మాత్రం తీవ్ర జాప్యం చేస్తుండడం అనేక అనుమానాలను రేకెత్తిస్తున్నది. సింగరేణిలో సంస్థ ప్రకటించిన లాభాల మేరకు కార్మికులకు వాటా చెల్లించే ఆనవాయితీ ఉంది. ఈ క్రమంలో సంస్థ ఎప్పుడు లాభాలు ప్రకటిస్తుందోనని వారు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం దాదాపు ₹37 వేల కోట్ల వ్యాపారం జరిగినట్లుగా తెలుస్తున్నా.. ఐదు నెలలైనా లెక్క ఎందుకు తేలడం లేదనేది అందరినీ ఆందోళనకు గురిచేస్తున్నది. ఇతర ప్రభుత్వరంగ సంస్థలు ప్రతి మూడు నెలలకు ఒకసారి తమ వ్యాపార లాభాలను ప్రకటిస్తుంటే సింగరేణి మాత్రం ఏడాదికి ఒక్కసారి మాత్రమే ప్రకటిస్తున్నది. అయితే, లాభాల్లో వివిధ రకాల మొత్తాలను పక్కకు పెట్టడం కారణంగానే ప్రకటనలో ఆలస్యం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సింగరేణిలో గతంలో ఎప్పుడూ లేని విధంగా గత ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి 70 మిలియన్ టన్నులు దాటగా, లాభాలు రూ.మూడు వేల కోట్లకు పైగానే వస్తాయని అంచనా ఉండడంతో కార్మికులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గతంలో లాభాలపై 32 శాతం వాటాను ప్రకటించగా, ఈసారి వెంటనే లాభాలను ప్రకటించి 35 శాతం వాటా చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.